# వానలో కొబ్బరిచెట్టు



• హెచ్చార్కె

# వానలో కొబ్బరిచెట్టు

హెచ్చార్కె

**ఈ కవి...** సుమారు నలభయ్యేళ్లుగా ఉంటున్న ఊరు: హైదరాబాదు. *1951* అక్టోబర్ *10*న పుట్టి, పెరిగిన ఊరు: కర్నూలు జిల్లా, నంద్యాల తాలూకాలోని మారుమూల గ్రామం 'గని'. అమ్మ నాన్నలు : కొడిదెల సుబ్బమ్మ, సంజీవరెడ్డి. దిగువ మధ్య తరగతి రైతు కుటుంబం. ఇంటికి పది కిలోమీటర్ల దూరంలోని తలముడిపి జిల్లా పరిషత్ హై స్కూలులో చదువు. ఆ తరువాత విజయవాడ ఆంధ్ర లొయోలా కళాశాలలో, విశాఖ ఆంధ్రా విశ్వవిద్యాలయంలో. కృష్ణక్క, చలసాని ప్రసాద్, సి.వి. సుబ్బారావు, తమ్మినేని పుల్లయ్య, తేళ్ల సత్యవతి, అత్తలూరి వంటి మంచి మనుషుల సాహచర్యంలో తెలుసుకున్నదే ఎక్కువ. పన్నెండేళ్ల ఉద్యమ జీవితంలో భాగంగా రెండేళ్ల జైలు, 'విమోచన' పత్రిక సంపాదకత్వం, విరసంతో క్రియాశీల పయనం. వరవరరావు, కేవీయార్, మధుసూదన్‌రావు, ఎన్.కె., 'నమ్ము' అంటే ఇప్పటికీ ఇష్టం. పదారేళ్లపాటు వర్కింగ్ జర్నలిస్టుగా 'ఉదయం', 'ఈనాడు' పత్రికల్లో బాధ్యతల నిర్వహణ. అన్ని పూసల ఒకే దారం : కవిత్వం, కథ. వెలువరించిన పుస్తకాలు: 'గుండె దండోరా' (1979), 'రస్తా' (1980), 'లావా' (1984), 'అబద్ధం' (1993), 'ఒక్కొక్క రాత్రి' (1996), 'నకులుని ఆత్మకథ' (2004), 'చిన్న చిన్న ఘటనలు' (2009) కవితా సంపుటాలు; 'సంబరం' (సాహిత్య వ్యాసాలు); డి.డి. కోశాంబీ, ఆంటోనియో గ్రాంసీ, జాన్ స్టెయిన్ బెక్ వంటి రచయితల రచనల అనువాదాలు; ఉదయం, ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ పత్రికల్లో రాజకీయార్థిక సాహిత్య వ్యాసాలు. పలు మలుపుల పయనంలో దొరికిన అద్భుత స్నేహాలు: ఎస్. జయ, చంద్ర పుల్లారెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, మమత, డి.వి. కృష్ణ, వై. కాశీపతి, కె. శివారెడ్డి, విమల, నారాయణ స్వామి, సుధాకిరణ్, కె. శ్రీనివాస్, గుడిహాళం రఘునాథం, త్రిపిర్నేని శ్రీనివాస్, కల్లూరి భాస్కరం, గుడిపాటి, గౌరీశంకర్, విన్నకోట రవిశంకర్, యదుకుల భూషణ్. ఇటీవలి చేయూత డాక్టర్ వెల్చేరు నారాయణ రావు గారు. ఇందరు సజ్జనుల సాంగత్యం, ఇన్ని ఘటనల సమాహారం ఈ కవి జీవితం, కవిత్వం.

# వానలో కొబ్బరిచెట్టు

## హెచ్చార్కె

పాలపిట్ట-బుక్స్
హైదరాబాద్

*VAANALO KOBBARICHETTU*
Poetry by **HRK**

hrkkodidela@gmail.com
040 27178475
206, S R Apartments,
Ravindra Nagar Colony,
Habsiguda, Hyderabad- 500 007

| | | |
|---|---|---|
| C | : | poet |
| Cover pix | : | Ananya<br>(An instance of two and half year old Ananya's activities at her day care center, 'Bright Horizons', BMS, CT, USA. Special thanks to Anya's teachers at the center.) |
| Cover Design | : | Ramana G.V. |
| First edition | : | September, 2011 |
| For copies | : | Palapitta Books<br>16-11-20/6/1/1<br>403, Vijayasai Residency,<br>Saleem Nagar, Malakpet,<br>Hyderabad - 500 036.<br>palapittabooks@gmail.com<br>Cell : 9848787284 |
| Price | : | Rs. 50/- |
| Printed at | : | Charitha Impressions,<br>Azamabad, Hyderabad.<br>Ph : 040-27678411 |

# పద్య సూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట అనబడు ఒక సంజాయిషీ | |
| 1. | వానలో కొబ్బరిచెట్టు | 11 |
| 2. | అమ్మూ! | 15 |
| 3. | చెంచు కుర్రాడు | 17 |
| 4. | నిర్ణయం | 19 |
| 5. | నేనూ వాళ్లు | 21 |
| 6. | ఆకాశం లోంచి చూడు | 23 |
| 7. | వీథి | 24 |
| 8. | చలి మంట | 26 |
| 9. | చనిపోయిన వాళ్లు చూస్తుంటారు | 28 |
| 10. | మ్యూజియంలో మానవుడు | 30 |
| 11. | ఒక పొద్దున్నే | 32 |
| 12. | మాటలు | 33 |
| 13. | డేట్ లైన్: హైదరాబాద్, 2010 | 35 |
| 14. | ఈ చీకటి చాలదు | 36 |
| 15. | పుణ్యం | 38 |
| 16. | రొద | 39 |
| 17. | రాయి రాయి రాసుకుంటున్నాయి | 40 |
| 18. | కిటికీ | 42 |
| 19. | విచిత్రాలు | 44 |
| 20. | ఖననం | 46 |
| 21. | ఉండాలి | 48 |
| 22. | అనుమతి పత్రం | 50 |
| 23. | ఊపిరి | 52 |
| 24. | ఉట్టి | 53 |

| | | |
|---|---|---|
| 25. | ఖేదమెందుకు? | 54 |
| 26. | విభజన | 55 |
| 27. | ఇంకో పొద్దున్నే | 57 |
| 28. | పై ఇంటామె | 59 |
| 29. | శరీర రేఖలు | 60 |
| 30. | అవిరామం | 62 |
| 31. | అంజలి | 63 |
| 32. | చీకటి కోటలో చిట్లిన క్షణమొకటి | 65 |
| 33. | కర్ణ గీత | 67 |
| 34. | అప్పుడప్పుడు | 69 |
| 35. | పునః పుటక | 70 |
| 36. | తొలకరి చినుకు | 72 |
| 37. | బొమ్మలు | 74 |
| 38. | దోసిలి | 75 |
| 39. | ముళ్లు | 76 |
| 40. | జ్వరం | 78 |
| 41. | జ్ఞాపకాలు | 79 |
| 42. | వానను నమ్ముకో | 80 |
| 43. | ఎలా? | 82 |
| 44. | శుద్ధ దుఃఖం | 83 |
| 45. | అందానికి సెలవని... | 84 |
| 46. | పొట్లకాయ | 86 |
| 47. | మూడు ప్రశ్నలు | 87 |
| 48. | రైలు | 88 |
| 49. | శిలువలు దిగి రండి | 89 |
| 50. | గొడుగులు | 91 |
| 51. | దిగులు కాండం మీద | 93 |
| | కృతజ్ఞతలు – వెల్చేరు నారాయణరావు | |

# ముందు మాట అనబడు ఒక సంజాయిషీ

అంటారు గాని, అన్నీ చిన్న చిన్న ఘటనలే.

ఎన్నో చిన్న చిన్న ఘటనలు కలిస్తే ఒక జీవితం.

నువ్వు రాజకీయ నాయకుడిగా రాజిల్లుతుండవచ్చు. ఉద్యమ జీవిగా రగులుతుండవచ్చు. ఉద్యోగిగా ఒక్కొక్క రోజును/రాత్రిని లాగుతుండ వచ్చు.

ఉన్నావు. అదీ గొప్ప. నిన్ను ఉండకుండా చేయాలని చూసే ఎన్నెన్నో శక్తులను ధిక్కరించి, నువ్వు ఉన్నావు. ఉండడం దానికదే గొప్ప.

జీవితం ఉత్సవం.

నవ్వు, ఏడుపు, సంక్రాంతికి ముందు చలి మంట, కాగిన చెంప మీద తొలకరి చినుకు, ఒకరు నీ వైపు ఇష్టంగా చూసిన చూపు, మనస్సులో ఇంకిపోయే వగరు తీపి ముద్దు, “నౌ ఐ నో మై ఎబిసీస్, నెక్స్ట్ టైమ్, వోన్ట్యూ సింగ్ విత్ మీ” అని ఆడుకోడానికి పిలుస్తో మీదికి దూకి మెడ చుట్టు చేతులు చుట్టిన పాప స్పర్శ, దిగులుగా ముఖం వేలాడేసుకు వెళ్తున్న నీ భుజం మీద అప్యాయంగా చెయ్యేసి ‘మొన్న నీ పద్యం చూశా, బాగుంది, నాక్కూడా నీలాగే అనిపించింద’న్న మిత్ర వాక్యం... జీవితం నిజంగా ఉత్సవం. మనిషి చనిపోయాక పదకొండో రోజు అతడి హితులందరూ ఒక చోట చేరి భక్ష్యాలు వండుకు తిని దుఃఖాన్ని ధిక్కరించడం కూడా ఉత్సవమే.

ఒక ఉత్సవ వర్ణన మరో ఉత్సవానికి నేపథ్య గీతం. వర్ణనలో దుఃఖం ఉంటే, మరీను.

అనుభవాలకు పెద్దంతరం చిన్నంతరం లేదు. వాటిని తిరిగి చెప్పే పలుకుబడిలో ఉంటే ఉండొచ్చు.

## 2.

ఒక యుగం వచ్చి పోతుంది.

యుగమంటే రెండేళ్లు, మూడూ లేక ఐదేళ్లు అంతే.

కవి ఎప్పుడూ ఒకే యుగంలో జీవించ(లే)డు. జీవించాల్సి వస్తే చచ్చి పోతాడు. పోకపోతే ఉంటాడు గాని, చచ్చి.

యుగారంభలో ఒక సూక్ష్మాణువేదో పుడుతుంది. అదేమిటో దానికే తెలియదు, కవికేమి తెలుస్తుంది?

కవి ఊరుకోడు. శోధిస్తాడు. గోరంత లేని కాగితం ముక్కతో గంటల తరబడి ఆడుకునే పాపాయిలా సూక్ష్మాణువుతో ఆడుకుంటాడు.

సూక్ష్మాణువు పగిలి దాన్నుంచి విస్తరించే చుక్కల వెంట పరిగెడతాడు. అది వెదజల్లే ఆణుధార్మిక శక్తికి గాయపడతాడు. నల్ల బిలాలలో పడి కొట్టుకుంటాడు.

గాయాలన్నీ ప్రదర్శించడు. కవి సిగ్గరి; వయసెంతయినా, వదలని కౌమారం.

ప్రదర్శిస్తే అందం అనుకున్నవే ప్రదర్శిస్తాడు.

యుగం ఎన్నాళ్లో ఉండదు. రెండేళ్లు, మూడూ లేక ఐదేళ్లు; అంతే.

ఆప్పటి వరకు తనకు కలిగిన ఆశ్చర్యాలు కవి పద్యాలు. వాటిని ఎవరికో ఇచ్చేసి తాను ఖాళీ అయిపోవాలి.

పుస్తకమైపోయి తనను తాను మరిచిపోవాలి. మళ్లీ పుట్టడం కోసం చని పోవాలి.

పుస్తకం కావడమంటే, చనిపోవడమే.

## 3.

ప్రేమను, వానను, ఎండను, మనిషిని, మనిషి లోని మంచిని నమ్ముకోవాలి. లేదు వేరే దారి.

ప్రేమను కూడా ఒక పాచిక చేసి విసిరే శకుని ఎక్కడున్నా సరే, వాడి బట్టలు ఊడదీయాలి.

ఒక చిట్టి నానమ్మ చెప్పింది, "వేమన బట్టలు లేకుండా తిరిగాడని బొమ్మలు గీస్తారు. అట్టా ఏం జరిగుండదు. దుర్మార్గం, అవివేకాల బట్టలు ఊడదీశాడాయన".

అవివేకం, దుర్మార్గం అనేవి వివేకం, ప్రేమల వేషంలో తిరుగుతుంటే; రాజుగారు

బట్టలేసుకోలేదని చెప్పే పని కవిది; 'సిన్నోడివి నీకేం తెలియద'ని పెద్దవాళ్లు బెత్తం పుచ్చుకున్నా సరే.

బెత్తం పుచ్చుకోని పెద్దవాళ్లకు నమస్కారం.

రకరకాల శిలువలు దిగి వచ్చి, కొరడాలను ధిక్కరించే సావాస గాళ్లతో కరచాలనం.

**4.**

పుస్తకమయిపోవడమంటే రచయిత చనిపోవడమే. ఈ లోపల కొంచెం మరమ్మతులకు వీలుంటుంది.

పత్రికలలో అచ్చయిన పద్యాలతో సహా అన్నిటినీ మరోసారి చదువుకున్నాను. తొందరపాటు అనే దుర్గుణం వల్ల జరిగిపోయిన తప్పులు దిద్దుకున్నాను. అత్యధికం రూపానికి సంబంధించిన తప్పులు, నాకు నేను పాఠకుడు కావడంలో దొర్లిన వైఫల్యాలు. దరిమిలా, పద్యాలు బాగా మారిపోయాయి.

ఇప్పుడు మీకు తెలిసిపోయి ఉంటుంది; ముందు మాటను సంజాయిషీ అని ఎందుకన్నానో!

**– హెచ్చార్కె**

29-1-2011

# వానలో కొబ్బరిచెట్టు

వాన గొప్ప నాట్య గురువు.

కనిపించే, కనిపించని కాల్జేతులు,
ముడి వీడిన జడలు, మురిపించే హొయలు.
భయదమై, అభయమై,
బయట, లోపల, అటు ఇటు, పైకీ కిందికీ.
తెలిసిన, తెలియాల్సిన దిశలన్నిటా.

నయనాన్ని పంపించు; రెప్పలు గట్టిగా మూసుకున్న దాన్ని.
వేణువును పంపించు; నిద్దట్లో మెలకువ బాణీ తెలిసిన దాన్ని.

నీరు నటిస్తుంది, జోకొట్టే చెయ్యిలా, ఒక్కొక్క బుడగగా.
నీరు స్ఫుటిస్తుంది, చీకటిని తాగి కాంతిని త్రేన్చే వజ్రంలా.

పొడి పొడిగా కురిసినప్పుడు చేతిలోనికి తీసుకుని చూడు
మెత్తని స్ఫటికాలను, ప్రతి స్ఫటికంలో ఒక సూర్యుడిని.

ప్రయాణం హడావిడిలో మరవకు,
వేణువులో దాచి ఉంచుకో,
నీ అతి శీతలమైన దప్పికను.
జారిపో ఒక సొంత గంజాయి రాత్రి లోనికి.

## 2.

నువ్వొక కొబ్బరిచెట్టువి.

వానలో కొబ్బరిచెట్టు ఓలలాడుతుంది.
కొబ్బరిచెట్టులో వాన నాట్యమాడుతుంది.
అడవి–చెట్టును కప్పేసే లతలా బతుకు చుట్టుముడుతుంది.
ఒక స్థలం కాని స్థలం లోంచి ఏదో గుసగుసలాడుతుంది.
అర్థం చెబితే, ఒద్దొద్దు, చచ్చిపోతుంది,
మరణ విషం విస్తరిస్తుంది అంతటా.

లోపల అణువులు పరిపక్వమవుతాయి.
తెలియక అడవిలో కాలు మోపావేమో,
ఇక్కడే ఇప్పుడే వదిలెయ్ ఈ పేజీని.
ఇది ఊపిరితో కలుషితమయ్యింది.

పెనం మీద నూనె మాదిరి
శ్రమ మీద చెమట మాదిరి
చెమట లోపలి ఉప్పు మాదిరి

నీరు నాట్యం చేస్తుంది.

## 3.

అర్థాలు అడక్కుండా ఆడుకోవడమెలాగో
అడిగితే పాపాయి నడుగు,

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=471**